సాక్షి చిత్తూరు

మంగళవారం । 9 । జూలై । 2024



పరిష్కరించండి సారూ!

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. వివిధ శాఖలకు 194 వినతులు అందాయి. - 8లో



ఎర్ర స్మగ్లర్ల 'కాషాయీకరణ'!

ఎర్ర స్మగ్లర్లు కాషాయీకరణతో బురిడీ కొట్టిస్తున్నారు. ఎర్రచందనం అక్రమరవాణా చేస్తున్నారు. - 8లో



అవినీతి లేదు గోవిందా!

తిరుమలలో గత ఐదేళ్లుగా ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని విజిలెన్స్ అధికారులు తేల్చిచెప్పారు. - 8లో

న్యూస్ రీల్

రేపు మెగా జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఈ నెల 10న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రముఖ సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి నిర్వహించనున్న ఈ మేళాలో మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారని చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికయ్యే అభ్యర్థులకు నెలకు కనీసం రూ.8 వేల నుంచి రూ.14,500 వరకు జీతం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు10వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎస్టేట్ వద్ద ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

వరసిద్ధుని హుండీ ఆదాయం రూ.1.32కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానులకను సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,32,32,171 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వెంకటేశు చెప్పారు.అలాగే బంగారం 92 గ్రాములు, వెండి ఒక కిలో 160 గ్రాములు భక్తులు సమర్పించారు. ఇక గో సంరక్షణ హుండీ ఆదాయం లెక్కించగా రూ.11,586, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.32,231, విదేశీ కరెన్సీ పరంగా యూఎస్ఏ 1,431 డాలర్లు, యూఏఈ 605 దిర్హామ్, మలేషియా 1016 రింగిట్స్, ఆస్ట్రేలియా 20 డాలర్లు, సింగపూర్ 17 డాలర్లు, కెనడా 5 డాలర్లు, 10 యూరోలు వచ్చినట్లు ఈఓ వివరించారు. ఇదంతా 19 రోజులకు లభించిన ఆదాయమని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక పంపిణీ చేయాలి

- పాలూరు ఇసుక డిపో ప్రారంభోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్



ఇసుక డిపోను ప్రారంభిస్తున్న కలెక్టర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో నూతన ఇసుక విధానం అమలులోకి వచ్చిందని, తరలింపు పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు మండలం పాలూరు వద్ద సోమవారం ఇసుక స్టాక్ యార్డులో ఇసుక డిపోను ప్రారంభించి కలెక్టర్ మాట్లాడారు. ఇసుక తరలింపులకు సంబంధించి ప్రభుత్వ మార్గ దర్శకాలను విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక ప్రజలకు ఉచిత ఇసుకను చిత్తూరు మండలంలోని పాలూరు, దిగువమాసపల్లె, గంగవరం మండలంలోని గండ్రాజుపల్లె ఇసుక డిపోల నుంచి ఇసుకను పొందవచ్చునన్నారు. ప్రస్తుతం ట్రాక్టర్, 10 టన్నుల టిప్పర్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. డిపోలలో సమస్యలొస్తే టోల్ ఫ్రీ నంబర్ 08572 –299509కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో భూగర్భ గనుల శాఖ డీడీ ప్రసాద్, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, అసిస్టెంట్ జియాలజిస్ట్ పోలిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్టలో నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



చిత్తూరు జెడ్పీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తదితరులు



నగరిలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, పార్టీ నాయకులు

జోహార్ వైఎస్సార్

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులని ఆయన సేవలను కీర్తించారు. పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్ స్ఫూర్తితో తామంతా ముందుకెళ్తామని ప్రకటించారు.

- మహానేత...మనసా స్మరామి
- జిల్లాలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి
- నాయకులు, అభిమానుల నివాళి

చిత్తూరు కలెక్టరేట్ : మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులర్పించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వాడవాడలా వైఎస్ఆర్ విగ్రహానికి వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, అభిమానులు పూలదండలు వేసి సేవలను స్మరించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- చిత్తూరు నియోజకవర్గంలోని డీసీసీబీ బ్యాంకు ఆవరణ, జెడ్పీ కార్యాలయం ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహాలకు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, చిత్తూరు నగరపాలక డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.
- పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ పక్రుద్దీన్ షరీఫ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- పలమనేరు, వీ.కోట మండలాల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే వి.కోటలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పాల్గొని పలు కార్యక్రమాలు నిర్వహించారు.
- పూతలపట్టు నియోజకవర్గంలోని పి.కొత్తకోట, ఐరాల మండలం చిన్నవెంకటపల్లెలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. యాదమరి మండల కేంద్రంలో నిర్వహించిన జయంతిలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు.
- కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జన హృదయ నేత వైఎస్ఆర్

జన హృదయ మహానేత వైఎస్సార్ పేదలకు సేవ చేయడానికే జన్మించి వారికి సేవచేసే క్రమంలోనే ప్రాణాలు కోల్పోయిన త్యాగమూర్తి అని మాజీ మంత్రి ఆర్కే రోజా స్మరించారు. నగరి బస్టాండు ప్రాంగణంతోపాటు ఓంశక్తి ఆలయం సమీపంలోని మహానేత విగ్రహానికి పూలదండలు వేసి ఆమె నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఏరియా ఆస్పత్రిలో వార్డులోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన నేత వైఎస్సార్ అన్నారు. 108, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను అమలు చేసిన వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జెడ్పీటీసీ సభ్యులు గాంధీ ఎంపీపీ భార్గవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పుంగనూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప



పూతలపట్టు మండలం పి.కొత్తకోట వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు

'ఎన్నికల' బాధితులకు ఆర్థిక సాయం



శ్రీరంగరాజపురం: టీడీపీ దాడిలో గాయపడిన బాధితులకు చెక్కును అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కుప్పం: బాధితులకు చెక్కులను అందజేస్తున్న డాక్టర్ సుధీర్

- టీడీపీ మూకల దాడుల బాధితులకు వైఎస్సార్ సీపీ అధిష్టానం అండ
- చెక్కులు అందజేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్

శ్రీరంగరాజపురం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ మూకలు ఒక వ్యూహం ప్రకారం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై చేసిన దాడుల్లో గాయపడిన, ఆస్తి నష్టం కలిగిన వారికి ఆ పార్టీ అధిష్టానం అండగా నిలిచింది. శ్రీరంగరాజపురం, కుప్పం మండలాల్లో బాధితులకు పార్టీ తరఫున అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపేణా సోమవారం పంపిణీ చేశారు. శ్రీరంగరాజపురం మండలం పుళ్లూరు దళితవాడ వాసులపై టీడీపీ మూకల దాడులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆయన కుమార్తె కృపాలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. టీడీపీ మూకల దాడిలో ఆస్తి ధ్వంసమైన గిరి, గౌతమి, కరుణాకర్, మురళి, సూర్యప్రకాష్‌కు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఆ మొత్తాన్ని నారాయణస్వామి సోమవారం బాధితులకు అందజేశారు.

న్యాయం కోసం బాధితుల పక్షాన పార్టీ లీగల్ సెల్ పోరాటం

టీడీపీ, కూటమి మూకలు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులపై ఇప్పటికీ కక్షపూరితంగా చేస్తున్న దౌర్జన్యాలు, విధ్వంసాలను రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని, చంద్రబాబుకు ఇది తెలిసినా దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ బాధితుల పక్షాన న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించేందుకు సన్నద్ధమైందని చెప్పారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని, పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కృపాలక్ష్మి ప్రచార రథం నష్టానికి సైతం..!

అలాగే కృపాలక్ష్మి ప్రచార రథాన్ని సైతం ఆగంతకులు కాల్చి వేయడంతో ఆమెకు కూడా పార్టీ అధినేత రూ.లక్ష ఇచ్చారు. అయితే ఆమె ఆ మొత్తాన్ని తిరిగి పార్టీ కార్యాలయానికి పంపించారు. దాడిలో గాయపడిన వారికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం మండలంలో..

కుప్పం రూరల్: ఎన్నికల ఫలితాల అనంతరం కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహాలింగం ఇంట్లోకి టీడీపీ మూకలు దౌర్జన్యంగా ప్రవేశించి టీవీ, ఏసీలను, ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశాయి. అలాగే, పలార్లపల్లెకు చెందిన గణపతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. బాధితులను ఆదుకోవాలని పార్టీ అధినేత రూ.50 వేల చొప్పున చెక్కులను ఇచ్చారు. ఆ చెక్కులను సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ బాధితులకు అందజేశారు.

బాధితులకు అండగా న్యాయవాదుల విభాగం ఏర్పాటు

- కూటమి నేతలు దాడులు చేస్తే మూల్యం చెల్లించక తప్పదు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: తెలుగుదేశం, కూటమి నాయకులు చేస్తున్న దాడులు, ఆస్తుల నష్టం నుంచి వైఎస్సార్‌సీపీ వారిని కాపాడేందుకు న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేసినట్టు పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరులో ఇండోర్ స్టేడియంను తెలుగుదేశం పార్టీ గూండాలు కూల్చివేయడం, తప్పుడు కేసుల బనాయింపులు, బెదిరింపులపై ఎప్పటికప్పుడు న్యాయవాదులు చర్యలు తీసుకుంటారని, నియోజకవర్గంలోని కూటమి శ్రేణుల నుంచి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఉచితంగా న్యాయసేవలు అందించనున్నట్లు చెప్పారు. ఇందు కోసం పుంగనూరుకు చెందిన సీనియర్ న్యాయవాదులను వైఎస్సార్‌సీపీ తరఫున వాదించేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్టీ వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగినా స్థానిక కోర్టులతో పాటు హైకోర్టు, హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కు న్యాయవాదులు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసి, కేసు దాఖలు చేస్తారన్నారు. దాడులు, ఆస్తుల నష్టంపై పోలీసులు స్పందించకపోతే పార్టీ తరఫున వారిపై కూడా కేసులు దాఖలు చేస్తారని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని, దాడులకు మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే హెచ్చరించారు. పుంగనూరు నియోజకవర్గంలోని బాధితులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ క్రింది న్యాయవాదులను సంప్రదించాలని ఆయన సూచించారు.

1. సి.మల్లికార్జునరెడ్డి సెల్ నంబర్: 9440752067
2. పి.ఎస్.ఎస్.ప్రకాష్, సెల్ నంబర్: 9440001995
3. కె.అంజిబాబు, సెల్ నంబర్: 9449589591
4. కెవి.ఆనందకుమార్, సెల్ నంబర్: 9849172053
5. ఎం.రాఘవేంద్ర, సెల్ నంబర్: 8247228034
6. ఎంఎస్.రోహిత్‌రెడ్డి, సెల్ నంబర్: 9491076430

ఆస్తుల విధ్వంసమే కూటమి నిరంతర ప్రక్రియ

- అంబేడ్కర్ కాదు..రాష్ట్రంలో 'బాబు' రాజ్యాంగం అమలు
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపాటు
- దమ్మంటే సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చండి

శ్రీరంగరాజపురం: వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులు, అభిమానులపై టీడీపీ కూటమి దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసకాండకు స్వస్తి పలికేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడుని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఒకవేళ దాడులు కొనసాగించాలంటే తొలుత తమను కాల్చివేసి, ఆపై తక్కిన వారిపై ప్రతాపం చూపాలని ఒకింత ఆగ్రహంతో అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన వారిపై, నాయకులు, సానుభూతిపరులపై కక్ష కట్టి దాడులు చేయడం, ఆస్తుల్ని ధ్వంసం చేయడం నిరంతర ప్రక్రియగా పెట్టుకుని కూటమి కొనసాగిస్తోందని మండిపడ్డారు. కులం, మతం, వర్గం, వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, ప్రాథమిక విధులు–హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయక రాష్ట్రంలో చంద్రబాబు రాజ్యాంగం నడుస్తోందని దుయ్యబట్టారు. గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేయలేద నెపంతో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై దాడులు చేయడం దారుణమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను ప్రస్తుత కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు నిలుపుదల చేయించారని, అంతేకాకుండా వాటి ప్రారంభించాలంటే కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తామేగానీ అవినీతికి కాదని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించకుండా దమ్ము, ధైర్యం ఉంటే సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని సవాల్ విసిరారు.

విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు



సైకిళ్లు అందజేస్తున్న డీవీఈఓ సయ్యద్‌మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసినట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. సోమవారం ఆ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారికి దాతల సహకారంతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందజేసే విద్యాసామగ్రి ప్రతి విద్యార్థికీ అందజేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్న కణ్ణన్ కళాశాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పోలీసు గ్రీవెన్స్‌కు 39 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి వాటిని పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు. అలాగే ఏఎస్పీ ఆరీఫుల్లా, 'దిశ' డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

బోయకొండ ఈఓగా ఏకాంబరం


ఏకాంబరం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఏకాంబరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాళహస్తి దేవస్థానంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ బదిలీపై బోయకొండకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రమౌళి గుంటూరు ఆర్‌జేసీ కార్యాలయానికి జేవీఓగా బదిలీ అయ్యారు. ఏకాంబరానికి చంద్రమౌళి స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, బోయకొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు ఆలయ ఖ్యాతిని మరింత చాటిచెప్పడానికి కృషి చేస్తానన్నారు. బోయకొండ ఆలయాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు.

సమస్యలు ఆలకించి...

పరిష్కరించండి సారూ!

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 194 అర్జీలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : తమ సమస్యలను ఆలకించి...పరిష్కరించాలని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 194 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 171, డీఆర్‌ఓ 5, నేషనల్ హైవే 5, పోలీస్ శాఖ 3, డీఆర్‌డీఏ 4, నగర మున్సిపాలిటీ 1, ఏపీఎస్ ఆర్టీసీ 2, డ్వామా 1, డీసీఓ-ఏపీఏస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్ 1, సమగ్ర శిక్ష 1 చొప్పున అర్జీలు అందాయని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బధిరుల సంఘం నాయకులు


నకిలీ సదరం సర్టిఫికెట్లతో ఇబ్బందులు

ప్రభుత్వ ఆసుపత్రులలో నకిలీ సదరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తుండడంతో ఇబ్బందులు అధికమవుతున్నాయని జిల్లా బధిరుల సంఘం జిల్లా అధ్యక్షులు ధనంజయులు, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌కుమార్ పేర్కొన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యక్రమంలో సైన్ లాంగ్వేజ్ ఇంట్రాప్టర్ మాధుర్య మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో అర్హులైన వారు నకిలీ సదరం సర్టిఫికెట్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన బధిరులందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం దీనికి నేతృత్వం వహించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు పరంధామయ్య, నరసింహులు మాట్లాడారు. తమకు కనీస వేతనం రూ.20 వేలు వేతనం ఇవ్వాలని, అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తమపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒత్తిళ్లు లేకుండా చూడాలని కోరారు.

ఇల్లు మంజూరు చేయాలని..!


ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్న కెంపమ్మ

తనకు ఇల్లు లేదని మంజూరు చేయాలంటూ చిత్తూరులోని చామంతిపురానికి చెందిన కెంపమ్మ జేసీకి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ, తనకు భర్త, పిల్లలు ఎవరూ లేరని, ఉండేందుకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

జీవనాధారం లేదు.. ఉద్యోగం ఇప్పించరూ!

తనకు ఉద్యోగం ఇప్పించాలని రామకుప్పం మండలం చిక్కపల్లె గ్రామపంచాయతీ చెలిమిచేను తాండాకు చెందిన రాధ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తన సమస్యను నివేదించారు. తాను జీఎన్‌ఎం కోర్సు పూర్తి చేశానని, నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఎలాంటి జీవనాధారం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. కుప్పం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టును ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశాన్ని పరిశీలించాలని సమగ్రశిక్ష ఏపీసీని కలెక్టర్ ఆదేశించారు.


కలెక్టర్‌కు సమస్యను నివేదిస్తున్న రాధ

పసికందు హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పసికందు హత్య కేసులో బీఎన్‌ఆర్‌పేట పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో గురువారం డీఎస్పీ మీడియాకు తెలిపిన వివరాలు... చిత్తూరు మండలం దిగువమాసాపల్లెలో తాగిన మైకంలో సవతి తండ్రి పసికందు(దినేష్)ను నేలకు కొట్టి హతమార్చడం విదితమే. తవణంపల్లె మండలం క్రిష్టాపురానికి చెందిన పసికందు తల్లి మూడు నెలలకు క్రితం దిగువమాసాపల్లెలోని కోళ్లఫారంలో పనికి చేరింది. భర్తను వదిలేసిన ఆమె అదే గ్రామానికి చెందిన ప్రదీప్ (34)తో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రదీప్ కూలి పనిచేస్తూ ఆమెతో పాటు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఫారానికి వచ్చాడు. ఆ సమయంలో బిడ్డ ఏడుస్తుండడం చూసి ఆగ్రహించాడు. ఆ బిడ్డ తనకు అడ్డు అని భావించి నేలకేసి కొట్టి చంపేశాడు. తీరా ఇంటి మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు పడి బాలుడు చనిపోయినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. అయితే తల్లి బంధువులు అనుమానించి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణలో వాస్తవాలు వెల్లడయ్యాయి. కసాయి తండ్రిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. కార్యక్రమంలో సీఐ కుల్లయ్యప్ప, ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

మిమ్మల్నీ నరికేస్తాం!

- భయాందోళనతో పరుగులు తీసిన బాధితుడు

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం గడ్డూరు గ్రామానికి చెందిన నారాయణప్ప సాగు చేసిన మామిడి మొక్కలను దౌర్జన్యంగా అదే గ్రామానికి చెందిన ఆరెప్ప కుటుంబ సభ్యులు ఈనెల 5న నరికివేయడం విదితమే. నారాయణప్ప దీనిపై బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నారాయణప్ప సోమవారం తన వ్యవసాయ భూమిలోకి వెళ్లడంతో ఆరెప్ప కుటుంబ సభ్యులు దౌర్జన్యం చేశారు. మొక్కలను నరికినట్టే మీ కుటుంబ సభ్యులను కూడా నరికివేస్తామని బెదిరించడంతో నారాయణప్ప పరుగులు తీశాడు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్వర్ణలత, వీఆర్‌ఓ గోపాలక్రిష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘర్షణ చోటుచేసుకున్న వ్యవసాయ భూమి నారాయణప్పదేనని, మామిడి మొక్కలు నరకడం బాధాకరమని తహసీల్దార్ అన్నారు.


నరికి వేసిన మామిడి మొక్కలను పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

ప్రేమ విఫలమై..మనసు వికలమై..!


అజయ్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఓ యువకుడు ప్రేమ విఫలమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథ రెడ్డి కథనం.. సాంబయ్యకండ్రిగకు చెందిన అజయ్ (24) కొంతకాలంగా ఓ యవతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఆ యువతికి, అజయ్‌కు మధ్య విభేదాలు తలెత్తడంతో ఇద్దరూ విడిపోయారు. దీన్ని తట్టుకోలేని అజయ్, ఆదివారం రాత్రి సాంబయ్య కండ్రిగ కూడలి వద్ద ఉన్న ఓ సెల్‌ఫోన్ టవర్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఇది వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎర్ర స్మగ్లర్ల 'కాషాయీకరణ'!


- ఒక స్మగ్లర్ అరెస్ట్, మరో ఇద్దరు పరారీ
- 14 దుంగల స్వాధీనం
- కాషాయ వస్త్రాలు ధరించి భక్తుల రూపంలో బురిడీ కొడుతున్న వైనం!

పుత్తూరు: అక్రమ రవాణాకు సిద్ధం చేసి ఉంచిన ఎర్రచందనం దుంగలతో పాటు ఓ వ్యక్తిని అటవీశాఖ అధికారులు సోమవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. పుత్తూరు ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి కథనం.. ఆదివారం రాత్రి సదాశివకోన అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా, మల్లేరి మిట్ట వద్ద ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న వ్యక్తులను అటవీ సిబ్బంది గుర్తించి వారిపై దాడి చేసి ఒకరి పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. సంఘటన స్థలంలో 107 కేజీల బరువు ఉన్న 14 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుంది. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలై జిల్లా మంచమల్లికి చెందిన మునస్వామి మాణిక్యంగా గుర్తించారు. స్మగ్లర్లు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కాషాయ వస్త్రాలు ధరించి భక్తుల రూపంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు రేంజర్ మాధవి తెలిపారు. పుత్తూరు ఫారెస్ట్ రేంజి పరిధిలో కూంబింగ్‌ను నిరంతరం చేస్తున్నట్లు చెప్పారు. కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ లోకేష్, బీట్ ఆఫీసర్లు కుమారస్వామి, అబ్దుల్, నాగయ్య, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శివరాజు, సిబ్బంది వెంకటేష్, నరేష్, రవి, భోగరాజు, భాను పాల్గొన్నారు.

అవినీతి లేదు గోవిందా!

- ఆ ఐదేళ్లు నిబంధనల మేరకే టీటీడీలో పాలన
- సీఎం చంద్రబాబుకు తేల్చిచెప్పిన విజిలెన్స్ బృందం
- నో నో.. ఏదో ఒకటి దొరికేవరకు తనిఖీలు, సోదాలు ఆపొద్దు
- విజిలెన్స్ బృందానికి మరోసారి సీఎం ఆదేశాలు
- అధికారులు, పలువురు నేతలపై నిందలుమోపే లక్ష్యంగా సోదాలు

'సార్.. ఆ ఐదేళ్లు టీటీడీలో పరిపాలనకు సంబంధించిన అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాం. నిబంధనల మేరకే పాలన జరిగినట్టు స్పష్టమవుతోంది. ఎక్కడా అవినీతి, అక్రమాలకు ఆస్కారమే లేదు. ఒకటికి రెండుసార్లు రికార్డులు పరిశీలించి చెబుతున్నాం.. అంటూ విజిలెన్స్ అధికారులు మొత్తుకుంటున్నా.. సీఎం చంద్రబాబు అస్సలు పట్టించుకోవడం లేదు. నోనో..మీరు మరోసారి పరిశీలించండి..' అంటూ ఆదేశిస్తున్నారు. దీంతో చేసేది లేక పది రోజులకుపైగా విజిలెన్స్ అధికారులు తిరుమలలోనే తిష్టవేసి సోదాలపైన సోదాలు చేస్తూ తలలుపట్టుకోవడం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.



సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీటీడీని అడ్డు పెట్టుకుని కూటమి పెద్దలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదచల్లేందుకు కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారు. గత ప్రభుత్వంలోని ముఖ్యులను లక్ష్యంగా చేసుకుని విజిలెన్స్ విచారణకు ఉపక్రమించారు. ఆ విచారణలో ఎంత శోధించినా టీటీడీలో అవినీతి అక్రమాలు జరిగినట్లు నిరూపించేందుకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు. ఏదో ఒకటి దొరికే వరకు సోదాలు, తనిఖీలు ఆపొద్దని కూటమి ప్రభుత్వ పెద్దలు హుకుం జారీచేశారు.

శ్రీవాణిని తీసుకొచ్చేందే నాటి టీడీపీ పాలకమండలి

కూటమి ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో శ్రీవాణి నిధుల విషయంపై ఆసక్తి కర విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీవాణి టికెట్ల పేరుతో ప్రత్యేక దర్శనాలు కల్పించాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది నాటి టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన టీటీడీ పాలకమండలేనని బయటపడింది. 2019 ఎన్నికల ముందు ఉన్న టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ నేతృత్వంలోని పాలకమండలి శ్రీవాణి దర్శనంపై తీర్మానం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికలు రావడంతో ఆ తీర్మానం అమలుకు నోచుకోలేదు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నాటి టీటీడీ పాలకమండలి ఆ తీర్మానాన్ని అమలులోకి తీసుకొచ్చింది.

శ్రీవాణి నిధులు పక్కదారి పట్టే అవకాశమే లేదు

తిరుమలకు వచ్చే భక్తులు శ్రీవారిని దగ్గరగా దర్శనం చేసుకోవాలని కోరుకోవడం సహజం. అయితే అందరికీ సిఫారసు లేఖలు లభించే అవకాశం లేదు. అలాంటి వారిలో ఆర్థిక స్తోమత ఉన్న వారు రూ.10,500 చెల్లించి శ్రీవాణి టికెట్ తీసుకుంటే టీటీడీ బ్రేక్ దర్శనం కల్పిస్తుంది. ఈ నిధుల్లో రూ.10వేలు శ్రీవాణి ట్రస్ట్‌కి వెళ్తే, రూ.500 టికెట్ సొమ్ము టీటీడీకి చేరుతుంది. శ్రీవాణి ట్రస్ట్‌కి రూ.10వేల చొప్పున చేరుతుంది. ఆ నిధులతో టీటీడీ పలు రాష్ట్రాల్లో 3,500కు పైగా ఆలయాలను నిర్మించిన విషయం విచారణలో వెలుగుచూసినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో శ్రీవాణి టికెట్లు ఆఫ్‌లైన్‌లో మొదట్లో వెయ్యి ఇచ్చేవారు. ఈ టికెట్ల కారణంగా సాధారణ భక్తులు ఇబ్బందులు పడకూడదని శ్రీవాణి టికెట్లను సగానికి తగ్గించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో శ్రీవాణి టికెట్లు గతం కంటే ఎక్కువగా ఇస్తున్నారు. రోజుకి 1,100పైగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే.. హిందూపురం ఎమ్మెల్యే, చంద్రబాబు బావమరిది నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి నిధులు ఇవ్వాలని టీటీడీకి లేఖలు పంపినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో శ్రీవాణి టికెట్లను ఇష్టానుసారం అమ్ముకున్నారని, ఆ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు విజిలెన్స్ విచారణలో వాస్తవాలు వెలుగు చూస్తుండడంతో ఏం మాట్లాడాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు! ఎలాగోలా గత ప్రభుత్వంలోని ముఖ్యులను ఇరికించేందుకు ఏదో ఒకటి చేయమని అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేస్తుండడం గమనార్హం.

తానా అంటే..తందానా అంటారు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో అవకతవకలు జరిగాయని సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ ఎల్లో మీడియా విషం కక్కుతున్న విషయం తెలిసిందే. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆయన మొదట శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. అనంతరం తిరుమలలోనే విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలుపెడుతామని ప్రగల్భాలు పలికారు. ఆ వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. రెండు, మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. అయితే విజిలెన్స్ అధికారులు గత ప్రభుత్వంలో ఎటువంటి అవినీతి అక్రమాలు జరగలేదని తేల్చారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు టీటీడీ విజిలెన్స్ అధికారులపై నమ్మకం లేక.. రాష్ట్ర, జిల్లా స్థాయిలోని 40 మంది విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. వారు బృందాలుగా విడిపోయి రోజుల తరబడి విస్తృతంగా సోదాలు చేశారు. అయినా కూటమి ప్రభుత్వ పెద్దలు ఆశించిన విధంగా అవకతవకలు బయటపడలేదు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు స్పష్టం చేసినట్లు సమాచారం.

నోనో..తనిఖీలు ఆపొద్దు

విజిలెన్స్ అధికారులు చెప్పిన సమాధానంతో షాక్ అయిన ప్రభుత్వ పెద్దలు జీర్ణించుకోలేకపోయారు. ఎలాగైనా పలువురిని ఇరికించేందుకు తగిన ఆధారాలు దొరికే వరకు సోదాలు ఆపొద్దని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో మరోసారి దర్శనాలు, సివిల్ వర్క్‌లపై తనిఖీలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పెద్దలను ఇరికించేందుకు వారు ఎటువంటి అవకతవకలకు పాల్పడనప్పుడు ఎలా? అని విజిలెన్స్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చంద్రబాబు చెప్పినదానికి, తిరుమలలో జరుగుతున్న దానికి పొంతనలేదని చర్చించుకుంటున్నారు. సామాన్యభక్తులకు దర్శనభాగ్యం కల్పించకుండా శ్రీవాణి పేరుతో ఇష్టానుసారం టికెట్లు అమ్ముకున్నారని కూటమి నేతలు ఎన్నికల ముందు నుంచి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. శ్రీవాణి ద్వారా వచ్చే నిధులంతా పక్కదారి పట్టాయని రాష్ట్ర ముఖ్య నాయకుల నుంచి గల్లీ లీడర్ల వరకు ఎవరి స్థాయిలో వారు విమర్శలు చేశారు. వారి విమర్శలను ఆధారంగా చేసుకుని ఎల్లో మీడియా అసత్య కథనాలను వండివార్చింది.

హత్య కేసులో జీవిత ఖైదు


నిందితుడు శీనయ్య

చిత్తూరు అర్బన్: ఓ వ్యక్తిని హత్య చేసి, దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులికల్లు రవీంద్రనాథ్‌రెడ్డి కథనం మేరకు.. పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం, కుప్పన్నపల్లెకు చెందిన బి.శీనప్ప వ్యవసాయం చేస్తూ భార్యాపిల్లల్ని పోషిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఎం.శీనప్ప(40), బి.శీనప్ప భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనిపై బి.శీనప్ప ఇద్దరినీ పలుమార్లు హెచ్చరించినా వారి తీరు మారలేదు. 2017 జూన్ 16న ఎం.శీనప్ప, బి.శీనప్ప ఇద్దరూ పొలం వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటుండగా వర్షం పడింది. ఇద్దరూ పక్కనే ఉన్న భైరవ స్వామి గుడి వద్దకు వెళ్లి నిల్చున్నారు. మరుసటి రోజు ఆలయం వద్ద బి.శీనప్ప విగతజీవిగా పడి ఉండటం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు ప్రశ్నిస్తే.. ఆ ముందు రోజు రాత్రి వర్షంతో పాటు పిడుగులు పడడంతో శీనప్ప మృతి చెందినట్లు ఎం.శీనప్ప నమ్మబలికాడు. దీనిపై మృతుడి తమ్ముడు వెంకటేశ్వరప్ప అనుమానించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎం.శీనప్పను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తే హత్యోదంతం బైటపడింది. బి.శీనప్ప గొంతుకు ధరించిన ఓ చిన్న పాటి దారం సాయంతో అతడి మెడకు బిగించి హత్య చేసినట్లు అంగీకరించాడు. అప్పట్లో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టుకు తరలించారు. కేసు తుది విచారణకు రాగా నేరం రుజువుకావడంతో నిందితుడు ఎం.శీనప్పకు 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

తప్పుచేసిన వారికి కోర్టుల్లో శిక్ష పడాలి


రేణుకకు ప్రశంసా పత్రం ఇస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: తప్పు చేసిన నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది దృష్టి సారించాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. ఇటీవల మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి చిత్తూరులోని న్యాయస్థానం 20 ఏళ్ల శిక్ష విధించడం తెలిసిందే. దీనిపై ఎస్పీ మాట్లాడుతూ, ఈ కేసులో దర్యాప్తు అధికారులు సేకరించిన సాక్ష్యాధారాలే కీలకంగా మారాయన్నారు. దీనికి తోడు కోర్టు కానిస్టేబుల్ నిబద్ధతతో పనిచేయడం వల్ల విచారణ కూడా త్వరలోనే ముగిసిందన్నారు. ఈ కేసులో దోషికి శిక్ష పడడంతో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ రేణుక, గుడుపల్లె కానిస్టేబుల్ సోమశేఖర్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ భక్తవత్సలంకు డీసీఆర్‌బీ సీఐ బాలయ్యతో కలిసి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందచేశారు.